ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-11-2026 సమయం: రాత్రి 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

- కడప జిల్లా పెన్నానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు, తాగునీటి పైప్‌లైన్‌కు నష్టం కలిగించిన ఘటనపై చర్యలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

- నౌకాదళ రంగంలో సామర్థ్యాల అభివృద్ధికి విశాఖపట్నం సహజసిద్ధ కేంద్రంగా నిలుస్తోందని డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్. బాలమురళీకృష్ణన్ పేర్కొన్నారు.

- గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలు కొనసాగుతాయని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ స్పష్టం చేశారు.

- పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు ఇటీవల విడుదల చేసిన షెడ్యూల్‌ని ప్రభుత్వ పరీక్షల విభాగం సవరించింది.

==========

కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం పెన్నానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు, తాగునీటి పైప్‌లైన్‌కు నష్టం కలిగించిన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అసహనం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి వివరణ ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలతో పాటు ప్రజల అవసరాలకు ఉద్దేశించిన తాగునీటి పైప్‌లైన్‌ను ధ్వంసం చేయడాన్ని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని ముఖ్యమంత్రి కార్యాలయం స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించినా, అక్రమ మైనింగ్‌కు పాల్పడినా ఎవరినీ ఉపేక్షించవద్దని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా, ఈ ఘటనలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వ్యక్తులపై ఇప్పటికే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ నివేదిక సమర్పించారు.

==========

నౌకాదళ రంగంలో స్వదేశీకరణ, నౌకా నిర్మాణం, మరమ్మతులు, నీటి అడుగున సాంకేతిక సామర్థ్యాల అభివృద్ధికి విశాఖపట్నం సహజసిద్ధమైన కేంద్రంగా నిలుస్తోందని డీఆర్‌డీఓ (నావల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్. బాలమురళీకృష్ణన్ పేర్కొన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (CII), సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్ (SIDM) సంయుక్తంగా విశాఖపట్నంలో ఈరోజు ఏర్పాటు చేసిన 'DEFCORE 2026' ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాల మురళీకృష్ణన్ మాట్లాడుతూ... రక్షణ రంగంలో వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి సాధించేందుకు పటిష్టమైన దేశీయ సరఫరా గొలుసు అవసరమని పేర్కొన్నారు. ఇందులో MSMEలు, స్టార్టప్‌ల పాత్ర కీలకమని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు ఇటీవల విడుదల చేసిన షెడ్యూల్‌ని ప్రభుత్వ పరీక్షల విభాగం సవరించింది. సవరించిన షెడ్యూల్‌ను ఈరోజు విడుదల చేసింది. రేపటి నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజు చెల్లించేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించింది. 50 రూపాయల అపరాధ రుసుముతో డిసెంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు, 200 రూపాయల అపరాధ రుసుముతో డిసెంబరు 10 నుంచి 13వరకు, 500 రూపాయల అపరాధ రుసుముతో డిసెంబరు 14 నుంచి 18వ తేదీ వరకు చెల్లించవచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

==========

కాకినాడ జిల్లా ఉప్పాడ మండలం సుబ్బంపేట గ్రామానికి చెందిన గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలు నిరంతరాయంగా కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ స్పష్టం చేశారు. ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ నెల 18న ఒడిశాలోని పారాదీప్ పోర్టు సమీపంలో వారు కనిపించినట్లు ప్రాథమిక సమాచారం అందగా.. ఆ తర్వాత ఫోన్, ట్రాన్స్‌పాండర్ ద్వారా ఎలాంటి సంకేతాలు రాలేదని పేర్కొన్నారు. సమాచారం అందిన వెంటనే కాకినాడ, ఒడిశా, చెన్నై కోస్ట్‌గార్డ్ కేంద్రాలను సమన్వయం చేస్తూ... నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులు యుద్ధ నౌకలు, హెలికాప్టర్ల సహాయంతో సముద్రంలో విస్తృతంగా గాలిస్తున్నారని వివరించారు. ఈ సమాచారాన్ని బంగ్లాదేశ్, మయన్మార్ నేవీ అధికారులతో కూడా పంచుకున్నామని కలెక్టర్ తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

==========

గోదావరి పుష్కరాల పనులకు 311 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ వెల్లడించారు. భీమవరంలో జిల్లా అధికారులతో ఈరోజు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్ల కోసం వివిధ శాఖల పరిధిలో 675 పనులకు 754 కోట్ల 51 లక్షల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేయగా, ఇప్పటివరకు 372 పనులకు 311 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని ఇన్‌ఛార్జి కలెక్టర్ తెలిపారు. మరో 303 పనులకు 449 కోట్ల రూపాయలు మంజూరు కావాల్సి ఉండగా, అదనంగా 73 పనులకు 273 కోట్ల 22 లక్షల రూపాయల బడ్జెట్ అవసరమని ప్రతిపాదనలు రూపొందించినట్లు చెప్పారు.

==========

విద్యార్థుల్లో రక్తహీనత నివారణపై విస్తృత అవగాహన పెంపొందించాలని విశాఖపట్నం జిల్లా సంయుక్త కలెక్టర్ జి. విద్యాధరి అధికారులను ఆదేశించారు. జిల్లాలో అమలు చేస్తున్న 'అనీమియా రహిత పాఠశాల కార్యక్రమం - మిషన్ 12/12' తీరుపై ఈరోజు విద్యా, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఆమె సమీక్ష

నిర్వహించారు. ఈ సందర్భంగా 20 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జీవశాస్త్ర ఉపాధ్యాయులు, హెల్త్ అంబాసిడర్లతో ముఖాముఖిగా చర్చించి క్షేత్రస్థాయి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల్లో రక్తహీనతను తగ్గించేందుకు పౌష్టిక ఆహారం, పరిశుభ్రత అలవాట్లపై అవగాహన కల్పిస్తూ... విద్యా, వైద్య శాఖలు సమన్వయంతో లక్ష్యాలను సాధించాలని సూచించారు.

==========

జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశామని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వెల్లడించారు. పాడేరులో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. మొదటి దశలో భాగంగా కొయ్యూరు, జి.కె. వీధి, చింతపల్లి మండలాల్లో పోలింగ్ జరగనుందని, ఇందుకోసం సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అదనపు పోలీసు బలగాలను మోహరించామని తెలిపారు. రౌడీషీటర్లు, గతంలో గొడవలకు పాల్పడిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసి ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, అల్లర్లకు ప్రయత్నించినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఓటర్లంతా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

(వాయిస్ 26 సెకన్లు)

==========

గోవాలో జరుగుతున్న 57వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (IFFI)లో సినిమాను అందరికీ చేరువ చేయడమే ప్రధాన లక్ష్యంగా నిలుస్తోంది. దివ్యాంగులు, నడవడానికి ఇబ్బంది పడేవారు కూడా చిత్రోత్సవాన్ని సులభంగా వీక్షించేందుకు వీలుగా ఎన్ఎఫ్డీసీ (NFDC), `స్వయం` (Svayam) సంస్థతో చేతులు కలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ `సుగమ్య భారత్ అభియాన్` లక్ష్యాలకు అనుగుణంగా ఈ ఏర్పాట్లు చేసినట్లు `స్వయం` అధిపతి భూపేందర్ సింగ్ ఆకాశవాణితో మాట్లాడుతూ చెప్పారు. ఇందులో భాగంగా, వేదికల వద్ద దివ్యాంగులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆ సంస్థ తనిఖీలు చేపట్టింది. దివ్యాంగుల పట్ల గౌరవంగా వ్యవహరించడం, వారికి అవసరమైన సహాయం చేయడంపై వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

==========

జిల్లాలో పశుగ్రాస కొరతను నివారించేందుకు 6 వేల ఎకరాల్లో పశుగ్రాసం పెంపకం చేపట్టాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించిన ఆయన.. పాడి రైతులకు పశుగ్రాస సాగు, వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి పశువైద్యశాల పరిధిలో పశుగ్రాస అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసి.. మాగుడు గడ్డి తయారీ, నీటి వనరుల లభ్యతపై దృష్టి సారించాలన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా పశుగ్రాస నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, మాగుడు గడ్డి, దాణా తయారీకి పారిశ్రామిక ప్రోత్సాహకాలు అందిస్తామని కలెక్టర్ తెలియజేశారు.

==========

మన్నార్ గల్ఫ్ నుంచి నైరుతి బంగాళాఖాతం వరకు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (APSDMA) ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రేపు పోలవరం, కోనసీమ, తూర్పుగోదావరి, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని వివరించారు.

==========
==========